సాక్షి ప్రకాశం

మంగళవారం ׀ 8 ׀ ఆగస్టు ׀ 2023



ఐబాబోయ్..!

జిల్లాలో కళ్లకలక కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. గాలిద్వారా వేగంగా వ్యాపించే వ్యాధి కావడంతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. - 8లో..



ప్రగతి రథసారథి సీఎం జగన్

రాష్ట్ర ప్రగతి రథసారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
38/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

12న నరసం కవితోత్సవం



కవితోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రచయిత సంఘ సభ్యులు

ఒంగోలు మెట్రో: నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ఈనెల 12వ తేదీ శనివారం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో వనితా వనం కవితా సౌరభం శీర్షికన శతాధిక కవయిత్రుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ తెలిపారు. సోమవారం నరసం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ప్రముఖ కవయిత్రులు డాక్టర్ కొలకలూరి ఆశాజ్యోతిని నల్లూరి రాజ్యలక్ష్మి స్మారక పురస్కారం, డాక్టర్ ఎస్.మస్తానమ్మని జంగం రోశమ్మ స్మారక పురస్కారం, మందరపు హైమావతిని వల్లభుని సీతాదేవి స్మారక పురస్కారం, కె.సుబ్బలక్ష్మమ్మ, చివుకుల శ్రీలక్ష్మీని నరసం ప్రత్యేక పురస్కారాలతోనూ సన్మానించనున్నట్లు అరుణ తెలిపారు. ప్రముఖ రచయితలు ముఖ్య అతిథులుగా పాల్గొనే ఈ కార్యక్రమంలో 130 మందికి పైగా కవయిత్రులు తమ కవితా గానంతో అలరించనున్నారు. కార్యక్రమంలో మహిళలకు సంబంధించిన పలు అంశాలపై తీర్మానాలు చేస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కవితోత్సవం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరసం ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షురాలు సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజర్ల సర్వే కమిటీకి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్ల సర్వే కమిటీ ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.లక్ష్మానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికార ప్రభుత్వ సంస్థలకు చెందిన ఇద్దరు ప్రతినిధులు, ఇద్దరు కమ్యూనిటీ ప్రతినిధులను ఎంపిక చేస్తారన్నారు. అందులో ఒకరు మహిళ అయి ఉండాలన్నారు. మొత్తం నలుగురు సభ్యులతో కూడిన విజిలెన్స్ కమిటీకి నామినేషన్ కోసం ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. మాన్యువల్ స్కావెంజర్లు జిల్లాస్థాయిలో సర్వే ప్రక్రియను పర్యవేక్షించడం కోసం కలెక్టర్ చైర్మన్‌గా ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. నిర్దిష్ట ప్రదేశానికి అవగాహన ప్రచారానికి, సర్వే గురించి ప్రచారం కల్పించేందుకు జిల్లాలోని అన్ని పట్టణాలు, నగరాలు, గ్రామాల కోసం మాన్యువల్ స్కావెంజర్ల తుది ఏకీకృత జాబితా ప్రచురించేందుకు, వారికి పునరావాసం, మాన్యువల్ స్కావెంజర్ల, సఫాయి కర్మచారీల సంక్షేమానికి పనిచేస్తున్న అనధికార ప్రభుత్వ సంస్థలకు చెందిన ప్రతినిధులను తమ ప్రతిపాదనలు పంపుకోవాలి. ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ప్రగతి భవన్, జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమ కార్యాలయం, ఒంగోలులో దరఖాస్తు సమర్పించాలన్నారు. దరఖాస్తుతోపాటు విద్యార్హత వివరాలు, చిరునామా, దరఖాస్తుకు ఒక ఫొటో, ఆధార్ కార్డు, ఓటరు కార్డు, మాన్యువల్ స్కావెంజర్ల, సఫాయి కర్మచారీల సంక్షేమం కోసం పనిచేస్తున్న సంస్థలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జతచేయాలని పేర్కొన్నారు. నిర్దిష్ట గడువు ముగిసిన తరువాత ఎటువంటి దరఖాస్తులు స్వీకరించరని లక్ష్మానాయక్ పేర్కొన్నారు.

మూడు చోట్ల ఇన్‌స్పైర్ మనక్ అవగాహన సదస్సులు

ఒంగోలు: ఇన్‌స్పైర్ మనక్ 2023–24 ఓరియెంటేషన్ కార్యక్రమం జిల్లాలో మూడుచోట్ల నిర్వహిస్తున్నామని ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను ఈ కార్యక్రమానికి పంపాలని డీఈవో వీఎస్ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమం ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల కేజీబీవీ, ప్రభుత్వ, ప్రైవేటు, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, ఏపీ మోడల్ స్కూల్స్, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలల నుంచి ఒక భౌతిక శాస్త్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయులను రిలీవ్ చేసి పంపాలన్నారు. ఈనెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో ఒంగోలు డివిజన్ ఓరియెంటేషన్ కార్యక్రమం, 10వతేదీ ఉదయం 9గంటలకు మార్కాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మధ్యాహ్నం 1.30 గంటలకు కనిగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాల కోసం సైన్స్ అధికారి టి.రమేష్‌ను 9666955504 మొబైల్ నంబర్‌తో సంప్రదించవచ్చన్నారు.



హలో... ఆకాశవాణి

వినిపించి.. మైమరపించి..!

అప్పటికింకా టీవీ అంటే ఏమిటో తెలియదు..టేప్ రికార్డర్లు సంపన్నులకే పరిమితం. మధ్య తరగతి ఇంట రేడియో ఉంటే మహారాజులే..అదే కాలక్షేపం..అందులో వచ్చే పాటలే ఆటవిడుపు..ప్రయోక్తల మాటలే జీవిత పాఠాలు.. అందుకే ఆనాడు ఆకాశవాణితో ప్రజలు మమేకమయ్యారు. సరిగ్గా మూడు పదుల కిందట మార్కాపురంలో ఆకాశవాణి ప్రసార విభాగం పురుడు పోసుకుంది. 101.5 మెగా హెడ్జ్‌పై ఈ కేంద్రం నుంచి తరంగాలు కొద్ది దూరాలకే పరిమితమైనా ఆ తరంగాలు శ్రోతల అంతరంగాలతో మిళితమయ్యాయి. ఒక వైపు వినోదం, మరో వైపు విజ్ఞానాన్ని పంచుతూ..ఆనాటి ఆణిముత్యాలు ఈనాటికీ అప్రతిహతంగా ప్రసారం చేస్తూ శ్రోతల మనస్సులను రంజింపజేస్తోంది. ఈ స్మార్ట్ యుగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ మొబైల్ అప్లికేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చి దేశదేశాంతరాల్లో తరంగాలు ప్రవహింపజేస్తూ నవతరానికి దగ్గరవుతోంది.

- మూడు దశాబ్దాలుగా సేవలు
- అన్ని వర్గాలకు చేరువయ్యేలా ప్రత్యేక కార్యక్రమాలు
- విజ్ఞానం, వినోదం, చైతన్యం కార్యక్రమాల ద్వారా చెరగని ముద్ర
- ప్రత్యేక యాప్ ద్వారా దేశ విదేశాలకు సేవలు విస్తరించి
- రేపు ఘనంగా 30 వసంతాల వేడుకలు



మార్కాపురం ఆకాశవాణి కేంద్రం

మార్కాపురం: రైతుల కోసం 'కిసాన్ వాణి'.. యువత కోసం 'క్విజ్ టైమ్, కరెంట్ అఫైర్స్'... మహిళల కోసం 'మహిళా భారతి', నాలుగు మంచి మాటల కోసం 'సూక్తి ముక్తావళి' డాక్టర్లతో సలహాలు, 'హలో ఎఫ్‌ఎం'తో యువత కోరే పాటలు, ఇలా ప్రతి రోజు వినూత్న కార్యక్రమాలు ప్రసారం చేస్తూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటోంది మార్కాపురం పట్టణంలో ఆకాశవాణి కేంద్రం. బహుజన హితాయా... బహుజన సుఖాయా అంటూ విజ్ఞానం, వినోదం, చైతన్యం నినాదాలతో ఆనందింపజేస్తోంది.

30 ఏళ్ల కిందట జనవాహిని ముందుకు..

1993 ఆగస్టు 9న అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కరరెడ్డి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. 101.5 మెగా హెడ్జ్‌పై మార్కాపురం ఆకాశవాణి కేంద్రం ప్రారంభమైన తొలినాళ్లలో 75 కిలోమీటర్ల వరకు రేడియో ప్రసారాలు వినిపించేవి. ఆండ్రాయిడ్ సెల్‌ఫోనులో ప్రసారభారతి న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఈ కేంద్రం రేడియో ప్రసారాలు వినవచ్చు. ప్రస్తుతం మార్కాపురం రేడియోకు తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగళూరు, చెన్నై నుంచి కూడా శ్రోతలు ప్రతిరోజూ ఫోన్లు చేసి తమకు ఇష్టమైన పాటలు అడుగుతుంటారు. ఎప్పటికప్పుడు శ్రోతలు మెచ్చే విధంగా వినూత్న కార్యక్రమాలు ప్రసారం చేస్తోంది. స్థానికంగా జిల్లాలో ఉండే కళాకారులను, కవులను ప్రోత్సహించేందుకు జానపద రంజని, కవి సమ్మేళనం, కవితలను ప్రసారం చేస్తోంది. కేంద్రం ప్రారంభంలో ఉన్న అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్లు వై.హనుమంతరావు, ఆ తరువాత వచ్చిన కె.వి.హనుమంతరావు, కృష్ణకుమారి, పాండురంగ, పి.సి.వి.సత్యనారాయణ, కృష్ణమోహన్, ఎన్.సుధాకర్, చిట్టిబాబు, సూర్యప్రకాశం, చిట్టిబాబు, మహేష్, నాగేశ్వరరావు, ఖుద్దూస్, బేతా రామ సూర్యప్రకాశరావుతో పాటు ప్రస్తుతం ప్రోగ్రామ్ హెడ్‌గా ఉన్న పీ ప్రశాంత్ కిరణ్, జీ దివ్య శ్రోతలు మెచ్చే కార్యక్రమాలను ప్రసారం చేస్తుండటంతో ఆకాశవాణిపై అందరూ మమకారం పెంచుకున్నారు.

అన్ని వర్గాల కోసం..

శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో ప్రతి రోజు 40 నిమిషాల పాటు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ మన్ననలు పొందింది. సంక్రాంతి, ఉగాది తదితర పర్వదినాల్లో కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ కవులను ప్రోత్సహిస్తోంది. యువత కోసం ప్రతి రోజు అర్ధగంట పాటు ప్రత్యేక కార్యక్రమాలను ప్రసారం చేస్తోంది. ప్రధానంగా క్విజ్ టైమ్, కిసాన్‌వాణి, హలో ఎఫ్‌ఎం కార్యక్రమాలు శ్రోతల మన్ననలు పొందుతున్నాయి. వీటితోపాటు 'పాటకు వేళాయెరా, గీత మాలిక' వంటి కార్యక్రమాలు కూడా శ్రోతల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి. చిన్నారుల కోసం బాలల నవల శీర్షికన కథలు ప్రసారం చేస్తున్నారు. వాట్సప్, ఉత్తరాల ద్వారా శ్రోతలు కోరుకున్న సినిమా పాటలు, సుమతీ శతక పద్య పఠనం తదితర కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ స్టేషన్‌ను సందర్శించి తమ సందేశాన్ని వినిపించారు. 'పద్య తోరణం' శీర్షికన ప్రతి సోమవారం గం.7.15కు కార్యక్రమ అధికారి డాక్టర్ చుండూరు మాణిక్యరావు అందించే సుమతి శతక పద్యాలు, ప్రతి శనివారం ఉదయం గం.7.15కు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి అందించే 'మనవూరి పేరులో ఏముంది' ధారావాహిక, ఇంకా సైన్స్ సీరియల్స్ శ్రోతల మనస్సుల్లో నిలిచిపోయాయి.



ట్రైనీ ఎస్పీని ఇంటర్వ్యూ చేస్తున్న ప్రశాంత్ కిరణ్

ప్రసారాలు ఇలా..

తొలుత ఈ స్టేషన్‌లో ప్రసారాలు సాయంత్రం 5 నుంచి రాత్రి 9.30 గంటల వరకు మాత్రమే ఉండేవి. కాలానుగుణంగా ప్రజల కోసం ఉదయం గం.5.52 నుంచి రాత్రి గం.11.10 వరకు ప్రసారాలు వినిపిస్తున్నారు. స్టేషన్ ప్రారంభమైనప్పుడు దాని సామర్థ్యం 2 కిలో వాట్స్ ఉండగా, ప్రస్తుతం దానిని 10 కిలో వాట్స్‌కు పెంచారు. దీంతో 100 కిలోమీటర్ల వరకు కార్యక్రమాలు వినిపిస్తాయి.

రేపు ఆకాశవాణిలో 30 వసంతాల వేడుకలు: ఆకాశవాణి కేంద్రం ప్రారంభమై 30 వసంతాలు పూర్తయిన సందర్భంగా బుధవారం ఉదయం కేంద్రంలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలువురు ముఖ్య ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు.

108 వారాలుగా పద్యతోరణం



ప్రతి సోమవారం ఉదయం 7.15 గంటలకు సుమతీ శతక పద్యాల్లోని భావాలను వివరిస్తూ పద్య తోరణం శీర్షికను 108 వారాలుగా ప్రసారం చేస్తున్నాం. ఈ నెలలోనే వేమన శతక పద్య పఠనం కూడా ప్రసారం కానుంది. శ్రోతలు మెచ్చే విధంగా కార్యక్రమాల ప్రసారం ఉంటోంది. డాక్టర్ల సలహాలు, రైతులకు సూచనలు, యువతకు క్విజ్, మహిళా భారతిలో మహిళలకు ఉపయోగపడే అంశాలు ప్రసారం చేస్తున్నాం.

– డాక్టర్ చుండూరు మాణిక్యరావు, ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్

రేడియో అంటే ప్రాణం



రేడియో అంటే ప్రాణం. ప్రతి రోజూ మార్కాపురం రేడియోలో వచ్చే మధుర గీతాలు (పాత పాటలు) కచ్చితంగా వింటాను. హలో.. ఎఫ్‌ఎం కార్యక్రమానికి నాతోపాటు మా ఫ్రెండ్స్‌ను కూడా ఫోన్ చేయించి మాకిష్టమైన పాత పాటలను ప్రసారం చేయించుకుంటాను. పనికెళ్లినా సెల్‌ఫోన్‌లో రేడియో ఆన్‌చేసి పనిచేస్తూ కార్యక్రమాలు వింటాను.

– సాల్మన్ రాజు, దేవరాజుగట్టు.

కవులు, కళాకారులకు ప్రోత్సాహం



మార్కాపురం ఆకాశవాణి కేంద్రం ద్వారా జిల్లాలోని కవులు, కళాకారులను ప్రోత్సహిస్తున్నాం. తెరమరుగైపోతున్న జానపద కళాకారులను పిలిపించి వారిలోని కళను రికార్డు చేసి ప్రజలకు వినిపించి వారిని ప్రోత్సహిస్తున్నాం. ఈ విషయంలో స్టేషన్ సాంకేతిక సిబ్బంది సహకారం మరువలేనిది. ప్రజలకు అవసరమయ్యే కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నాం. క్యాజువల్ అసైనీస్ సేవలు మరచిపోలేం. కవులు, కళాకారులు నేరుగా స్టేషన్‌కు రావచ్చు.

– పీ ప్రశాంత్ కిరణ్, ప్రోగ్రాం హెడ్, ఏఐఆర్, మార్కాపురం

నాణ్యమైన ప్రసారాలు అందిస్తున్నాం



మార్కాపురం ఆకాశవాణి కేంద్రం ద్వారా నాణ్యమైన ప్రసారాలు అందిస్తున్నాం. ఇప్పుడు డిజిటల్ ప్రసారాలు వస్తున్నాయి. మా సాంకేతిక సిబ్బంది ఎప్పటికప్పుడు శ్రోతలకు ప్రసారాల్లో అంతరాయం లేకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తుంటారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నా కార్యక్రమాల ప్రసార విషయంలో ఎటువంటి అంతరాయం ఉండదు.

– సుభాష్, డిప్యూటీ డైరెక్టర్ (ఇంజినీరింగ్)

30 ఏళ్లుగా రేడియో కార్యక్రమాలు వింటున్నా



మార్కాపురం రేడియో స్టేషన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రతిరోజూ రేడియో కార్యక్రమాలు వింటూ ఉంటాను. కంభం రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి గుడి పక్కనే నా హోటల్, ఉదయం 6 గంటలకు రేడియో ఆన్ చేస్తే భక్తి రంజని, వార్తలు, రైతులకు సూచనలు, డాక్టర్ల కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు ఒకటేమిటి అన్నీ వింటూ నా హోటల్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ వినిపిస్తూ ఉంటాను. మంచి కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నారు.

– టీ గురునాథం, మార్కాపురం.

అన్నదాతల సంక్షేమమే ఏకైక లక్ష్యం



సభలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, జంకె వెంకటరెడ్డి, ప్రణీత్‌రెడ్డి, తూమాటి, బత్తుల, కదిరి, శివప్రసాద్‌రెడ్డి



పీడీసీసీబీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న వైఎం.ప్రసాదరెడ్డి, సభ్యులు

- పీడీసీసీబీ చైర్మన్‌గా ప్రసాదరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ సభలో మంత్రి ఆదిమూలపు సురేష్
- భారీగా తరలి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు

ఒంగోలు టౌన్: రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టారని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఒంగోలులోని బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ వైఎం ప్రసాద రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అగ్రస్థానంలో నిలబెట్టేందుకు పట్టుదలగా పనిచేయాలని సూచించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టుల గురించి పట్టించుకోకుండా ఇప్పుడు యుద్ధభేరి పేరుతో రకరకాల గారడీలు చేస్తున్నారని విమర్శించారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న వలంటీర్ల గురించి టీడీపీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. వలంటీర్ల పెత్తనం పెరిగిందని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో పందికొక్కుల్లా ఇక్కడెవరూ దోచుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనిచేసే కార్యకర్తలకు పదవులు వెతుక్కుంటూ వస్తాయని, ప్రసాదరెడ్డికి పీడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి ఇందులో భాగంగానే వరించిందని చెప్పారు. యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధతతో ఉన్న ప్రసాదరెడ్డిని పీడీసీసీబీ చైర్మన్ పదవి వరించడం హర్షణీయమని, సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

చంద్రబాబు వల్లే వర్షాలు వెనక్కి: ఎమ్మెల్సీ తుమాటి

రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురుస్తూ రైతులు ఆనందంగా ఉండడం ఓర్చుకోలేకనే హైదరాబాద్‌లో నివశిస్తున్న చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నారని, ఆయన పాద మహిమ వల్లే ఏడాది వర్షాలు వెనక్కి వెళ్తున్నాయని ఎమ్మెల్సీ తుమాటి మాధవరావు విమర్శించారు. లోకేష్ చేస్తున్న పాదయాత్ర కామెడీ యాత్రగా మారిందన్నారు. చంద్రబాబు పాలనలో సహకార రంగాన్ని కూకటివేళ్లతో సహ సర్వనాశనం చేశారని రాష్ట్ర మార్కెటింగ్ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. నష్టాల్లో కూరుకుపోయిన సహకార బ్యాంకు వందలాది డిపాజిట్లతో రూ.3 వేల కోట్ల టర్నోవర్‌తో కార్పొరేట్ బ్యాంకులతో పోటీపడే స్థాయికి చేరుకుందని తెలిపారు. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా బ్యాంకును మరింత అభివృద్ధి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సూచించారు. రైతులకు అండదండగా నిలిచి సీఎంకు మంచి పేరు తీసుకొని రావాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నారాంబాబు ఆకాంక్షించారు.

ఘనంగా ప్రమాణ స్వీకారం:

వేలాదిగా తరలి వచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వైఎం ప్రసాద రెడ్డి ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర మార్కెటింగ్ సలహాదారులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి చైర్మన్, డైరెక్టర్ల చేత ప్రమాణం చేయించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో తనకు ఈ పదవి వచ్చిందని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా పనిచేస్తానని వైఎం ప్రసాదరెడ్డి అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కదిరి బాబారావు, ఉడుముల శ్రీనివాసరెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు కుప్పం ప్రసాద్, కాకుమాను రాజశేఖరరెడ్డి, షేక్ సుభాన్ బి, చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు, ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు మాధవి, ఇనగంటి పిచ్చిరెడ్డి, మోహనరెడ్డి , ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి ఫోన్ ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించలేని సమస్యలను అందుకు ఉన్న కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. ఒకే సమస్యలపై అర్జీలు పునరావృతం కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు ఉమాదేవి, లోకేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు

- పొదిలికి చెందిన నాగార్జున డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తమకు 20 రోజుల నుంచి సాగర్ నీరు రావడంలేదని ఫిర్యాదు చేశారు. దీంతో నీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పరిశీలించి త్వరగా సాగర్ నీటిని సరఫరా చేయాలని కోరారు.
- నాగులుప్పలపాడు మండలం కొత్తకోట గ్రామానికి చెందిన బిక్షాలు స్పందనలో అధికారులను కలిసి గ్రామంలోని ఎస్సీ కాలనీలో 1–29ఏ గృహంలో నివసిస్తున్నానని జగనన్న సంపూర్ణ హక్కు పథకం కింద పట్టా కోసం రూ.10 వేలు చెల్లించానని తెలిపారు. పట్టా మంజూరైనా ఇవ్వడం లేదని ఫిర్యాదు చేస్తూ అర్జీ అందజేశారు.

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పర్యావరణ అనుకూల ఎలక్ట్రిక్ (విద్యుత్) వాహనాలను వినియోగించేందుకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గో గ్రీన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన బ్యాటరీతో నడిచే ద్విచక్ర వాహనాలు, కార్ల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ద్విచక్ర వాహనాన్ని కారును స్వయంగా నడిపి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్‌తో నడిచే ఇతర సంప్రదాయ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వల్ల శబ్ద కాలుష్యాన్ని, వాయు కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. కిలో మీటరుకు అవసరమయ్యే ఇంధన ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. వివిధ శాఖల్లో కూడా పూర్తిగా ఎలక్ట్రిక్ ప్రభుత్వ వాహనాలనే వినియోగించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నెడ్‌క్యాప్ ద్వారా ఈఎంఐ పద్ధతిలో డీలర్ల నుంచి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఐదేళ్ల పాటు ఈఎంఐ చెల్లించిన తర్వాత ఆయా వాహనాలు పూర్తిగా ఆ శాఖల సొంతమవుతాయన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలు కూడా లిథియం బ్యాటరీల స్థానంలో మరింత సామర్థ్యం కలిగిన సోడియం బ్యాటరీలను తయారు చేయడంపై దృష్టి పెట్టాయన్నారు. వ్యక్తిగత, వాణిజ్య అవసరాల కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని అన్నీ ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో నెడ్‌క్యాప్ డీజీఎం హరినాథ్‌బాబు ఇతర అధికారులు, టాటా మోటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ వాహనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా అధికారులు

గద్దర్‌కు ఘన నివాళి

ఒంగోలు:

ప్రజాగాయకుడు గద్దర్‌కు మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఘన నివాళి అర్పించారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రముఖ గేయ రచయిత, పోరాటాల ఉద్యమ నాయకుడు, మాటతో, పాటతో మనిషిలో చైతన్యాన్ని నింపిన మహోన్నతుడు గద్దర్ అన్నారు. ఆయన భౌతికంగా దూరమైనా గద్దర్ ఆశయాలు సమాజంలో చిరకాలం ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బైరెడ్డి అరుణ, గాజుల రాము తదితరులు పాల్గొని గద్దర్‌కు ఘన నివాళి అర్పించారు.

- నివాళులర్పించిన మంత్రి సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ



గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


వెంకటేశ్వరరెడ్డి మృతదేహం


విలపిస్తున్న బంధువులు

కొనకనమిట్ల: మోటారు సైకిల్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ప్రమాదం 565 జాతీయ రహదారిపై కొనకనమిట్ల సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. పొదిలి మండలం మల్లవరం గ్రామానికి చెందిన ఉడుముల వెంకటేశ్వరరెడ్డి(56) కొనకనమిట్లలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు తన మోటారుసైకిల్‌పై వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఉండగా కొనకనమిట్ల వద్ద మోటారుసైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడటంతో స్పృహ కోల్పోయారు. అటుగా వెళ్తున్న వారు గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ఉన్న ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో వెంకటేశ్వరరెడ్డి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడు వెంకటేశ్వరెడ్డికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉడుముల వెంకటేశ్వరెడ్డి వైఎస్సార్ సీపీ పొదిలి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డికి స్వయానా మామ అవుతారు. సమాచారం తెలుసుకున్న పొదిలి, కొనకనమిట్ల మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

కంట్లో చిన్న నలక పడితేనే భరించలేం. అటు వంటిది కండ్ల నిండా ఇసుక పోసినట్లుగా ఉండి ఒకటే మంటగా, దురదగా ఉంటే ఆ బాధను ఊహించడానికే భయం పుడుతుంది. కళ్ల కలక అలాంటి జబ్బే. పైగా ఇది అంటు వ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి చాలా తేలికగా వ్యాపిస్తుంది. ఎంత తేలికగా అంటే కళ్ల కలకతో బాధపడుతున్న వారిని తదేకంగా చూస్తే చాలు.. ఆ మరుసటి రోజుకల్లా వ్యాధి అంటుకునే ప్రమాదం పొంచి ఉంది. సుమారు ఐదేళ్ల తర్వాత మళ్లీ పడగ విప్పిన ఈ అంటు వ్యాధితో చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఐ బాబోయ్!

కలవరపెడుతున్న కళ్ల కలక



- జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్న 'మద్రాస్ ఐ' కేసులు
- గాలి ద్వారా వేగంగా వ్యాధి వ్యాపించే అవకాశం
- కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారుల సూచన

పెద్దదోర్నాల/మార్కాపురం: ప్రాంతాన్ని బట్టి మద్రాస్ ఐ, పింక్ ఐగా పిలిచే ఈ కళ్ల కలక ప్రాణాంతకం కాకపోయినా.. విపరీతమైన చిరాకు పుట్టిస్తుంది. జిల్లా కేంద్రమైన ఒంగోలుతోపాటు మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి, చీమకుర్తి తదితర ప్రాంతాల్లో కళ్ల కలకతో వేలాది మంది ఇబ్బంది పడుతున్నారు. ఒక్క మార్కాపురం పట్టణంలోనే సుమారు 2 వేల మందికి పైగా కళ్ల కలకతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. పలు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కళ్ల కలక బారిన పడటంతో హాజరు శాతం కూడా తగ్గిపోతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి చికిత్స తీసుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

వ్యాధి లక్షణాలు ఇవే..

కళ్ల కలక ఎడినోవైరస్ వల్ల సంక్రమిస్తుంది. ముఖ్యంగా ఇది వర్షాకాలంలోనే ఎక్కువగా వ్యాపిస్తుంది. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండటం వల్ల ఎడినో వైరస్ యాక్టివేట్ అయ్యి ఒక ప్రాంతమంతా వ్యాపించే అవకాశం ఉంది. దీన్ని అడినోవైరల్ ఇన్ఫెక్షన్ అని కూడా అంటారు. సాధారణంగా ఈ వ్యాధి వైరల్ కంజెక్టివిటిస్, బ్యాక్టీరియా కంజెక్టివిటిస్, అలర్జిక్ కంజెక్టివిటిస్ ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకడం వల్ల కళ్లు ఎర్రబారటం, ఉబ్బటం, రెప్పలు వాయడం, వెలుగును చూడలేక పోవడం, కంటి నుంచి నీరు కారడం, రెప్పలు అతుక్కుపోవడం, చూపు కూడా కొంత మసక బారడంతోపాటు జ్వరం కూడా వస్తుంది.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

తేలిగ్గానే నయం చేసుకోవచ్చు

కళ్ల కలక సోకిన వారు చిన్నపాటి చికిత్సతోనే వ్యాధిని నయం చేసుకోవచ్చు. ఎక్కువగా మందులు వాడాల్సిన పని ఉండదు. కళ్లను శుభ్రంగా కడుక్కోవడంతోపాటు లూబ్రికేషన్ డ్రాప్స్ లేదా యాంటీబయోటిక్ చుక్కల మందు లేదా అయోడిన్ డ్రాప్స్, ఆయింట్‌మెంట్‌ను వైద్యులను సంప్రదించి మాత్రమే వాడాలి. కళ్ల జోడు పెట్టుకుంటే ఇతరులకు వైరస్ వ్యాప్తి చెందకుండా ఉంటుంది. తగిన జాగ్రత్తలు పాటిస్తే రెండు మూడు రోజుల్లో వ్యాధి తగ్గిపోతుంది.

– డాక్టర్ భాస్కర్‌కుమార్, సూపరింటెండెంట్, పెద్దదోర్నాల సీహెచ్‌సీ

జాగ్రత్తలు తీసుకోవాలి

కళ్ల కలక బారినపడిన వారు నేత్రాలను తరచూ మంచినీటితో కడుక్కోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. మురికిగా ఉన్న చేతులతో కళ్లను తాకకూడదు. సబ్బు నీటితో తరచూ చేతిని కడుక్కోవాలి. కళ్లు దురదగా అనిపిస్తే పదే పదే రుద్దకూడదు. శుభ్రమైన కాటన్ క్లాత్‌తో తుడుచుకోవాలి. గాలి ద్వారా ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది కాబట్టి ఇతరులకు దూరంగా ఉండాలి. డాక్టర్ సూచనల ప్రకారం ఐ డ్రాప్స్ వాడాలి. ఆఫీసుల్లో, స్కూళ్లలో, కళాశాలల్లో ఎవరికైనా కళ్ల కలక ఉంటే వారికి కాస్త దూరంగా ఉండటం మేలు.

– డాక్టర్ చంద్రశేఖర్, నేత్ర వైద్య నిపుణుడు, మార్కాపురం

వ్యాప్తి నివారణకు కొన్ని జాగ్రత్తలు

కళ్ల కలక బారినపడిన వారు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే కళ్ల కలక ఇతరులకు వ్యాపించకుండా నివారించవచ్చని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

- వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారు నల్ల కళ్లజోడు వాడాలి.
- ఇతరులకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. కరచాలనం చేయడం, తాకడం మానుకోవాలి.
- చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- కంటిని నులమడం, రుద్దడం లాంటివి చేయకూడదు.
- కళ్ల కలకతో బాధపడే వారు వాడిన సబ్బు, బెడ్‌షీట్లు, టవళ్లు ఇతరులు వినియోగించకూడదు.
- కార్యాలయాల్లో విధులు నిర్వహించే వారు కళ్ల కలక బారినపడితే రెండు లేదా మూడు రోజులు సెలవు పెట్టడం మంచిది.
- కళ్ల కలక బాధితుల దగ్గరకు చిన్నారులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యాధి నయమయ్యే వరకు కాస్మోటిక్స్ వాడటం ఆపేయాలి.

ప్రగతి రథసారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


కేశినేనిపల్లిలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం మద్దతుగా నిలవాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని కేశినేనిపల్లిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మంచి పాలన అందిస్తున్నందున మనమంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు నిలిచి రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలే పెత్తనం చెలాయించాయని, కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటికే వస్తున్నాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేశారని, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పేద బడుగు, బలహీన వర్గాల కోసం సంక్షేమ ఫలాలను అందించేందుకు వలంటీర్ల వ్యవస్థను తెచ్చారని కొనియాడారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలని అన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను అందిస్తున్నందున అర్హులంతా సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. డీఎల్‌డీఓ సాయికుమార్, తహసీల్దార్ వి.కిరణ్, ఎంపీడీఓ సాంబశివరావు, ఎంఈఓ టి.రాజశేఖర్ రెడ్డి, ఏఈలు సురేష్, హనుమాన్‌బాబు, ఏఓ కె.నీరజ, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, దేవాలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ పద్మజ మల్లికార్జున్, గ్రామసర్పంచ్ వెంకటనారాయణ, ఎంపీటీసీ శారద, వైఎస్సార్ సీపీ నాయకులు సక్కా చిన్నత్రిపురరెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.

లారీ ఢీకొని వృద్ధుడు మృతి


చినయోగయ్య (ఫైల్)


సంఘటనా స్థలంలో మృతి చెందిన చినయోగయ్య

కొనకనమిట్ల: రోడ్డుపై నడిచి వస్తున్న వృద్ధుడిని వెనక నుంచి వస్తున్న సిమెంట్ లోడు లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం ఉదయం 565 జాతీయ రహదారి కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన వసంతపురం చినయోగయ్య(74) కొన్నేళ్లుగా స్థానిక పోలీస్‌స్టేషన్లో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయాన్నే ఇంటి నుంచి నడుచుకుంటూ పని నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు వస్తున్నాడు. పోలీస్ స్టేషన్‌కు కొద్ది దూరం వచ్చే సరికి అదే సమయంలో మాచర్ల నుంచి కనిగిరి వైపు సిమెంట్ లోడుతో వస్తున్న లారీ నడుచుకుంటూ వెళుతున్న చినయోగయ్యను ఢీకొట్టింది. ప్రమాదంలో రోడ్డుపై ఎగిరి పడిన చినయోగయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చినయోగయ్యకు భార్య , ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అందరికి వివాహాలు చేసిన చినయోగయ్య పోలీస్‌స్టేషన్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నిత్యం పోలీస్‌స్టేషన్లో అందుబాటులో ఉంటూ తోడుగా ఉండే చినయోగయ్య పోలీస్‌స్టేషన్‌కు దగ్గర్లోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంపై ఏఎస్సై గోపాలకృష్ణ, స్టేషన్ రైటర్ మురళీ, స్టేషన్ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చినయోగయ్య మృతి పట్ల వారు విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుబూతి వ్యక్తం చేశారు. ఏఎస్సై గోపాలకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చినయోగయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని చినయోగయ్య బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గోపాలకృష్ణ అన్నారు.

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు వినియోగించాలి


చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్


చేనేత వస్త్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్, మేయర్ తదితరులు

- జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మన సాంప్రదాయానికి నిదర్శనమైన చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ వినియోగించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశంభవనంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బెంగాల్ విభజనకు నిరసనగా బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 1905 ఆగస్టు 7వ తేదీ విదేశీ వస్తు బహిష్కరణకు స్వాతంత్ర్యం ఉద్యమ నాయకులు పిలుపునిచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకోవడం 2015వ సంవత్సరంలో ప్రారంభమైందని వివరించారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగంలో అత్యధికంగా ఉపాధి లభిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కనిగిరి, బేస్తవారిపేట, చీమకుర్తి, కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామాల్లో చేనేతకారులు ఎక్కువగా ఉన్నారన్నారు. నాణ్యమైన లుంగీలు, చీరలు, డ్రస్ మెటీరియల్స్, టవల్స్, దుప్పట్లను తయారు చేస్తున్నట్లు తెలిపారు. జాకర్డ్ చీరలను కూడా తయారు చేసేలా కార్మికులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. నేత కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈతముక్కల, కనిగిరి, బేస్తవారిపేటల్లో కామన్ ఫెసిలిటీ సెంటర్‌లను ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. చేనేత రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చేనేత ఉత్పత్తులను ప్రమోట్ చేసేందుకు కలెక్టరేట్‌లో శాశ్వత ప్రాతిపదికన ఒక స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ చేనేత రంగం ప్రాముఖ్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ నేతన్న నేస్తం, చేనేత పెన్షన్ కానుక పథకాల ద్వారా చేనేతకారుల కుటుంబాలకు అండగా నిలస్తున్నట్లు తెలిపారు. చేనేత రంగం గొప్పతనాన్ని భావితరాలకు తెలియచేయడంతో పాటు చేనేత వస్త్రాలు వినియోగించేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన అవగాహన ర్యాలీని కలెక్టర్, మేయర్‌లు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర టైలర్స్ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్‌పర్సన్ షేక్ సుభానీబీ, చేనేత జౌళి శాఖ ఆర్‌డీడీ భీమయ్య, సహాయ సంచాలకులు ఉదయకుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


యువకుడు ఆత్మహత్యాయత్నం

- భార్య ఫిర్యాదుతో వేగంగా స్పందించిన ట్రైనీ ఎస్పీ అంకితా సురానా
- ఫోన్ సిగ్నల్ ఆధారంగా దూపాడు కాలువ వద్ద గుర్తించి రక్షించిన పోలీసులు


యువకుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

మార్కాపురం: కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో క్వాలిఫై కాలేదని గత కొంత కాలంగా మనోవ్యథతో బాధపడుతున్న యువకుడు ఆత్మహత్యకు యత్నించగా.. సమాచారం అందుకున్న పోలీసులు సకాలంలో స్పందించి రక్షించారు. ఈ సంఘటన సోమవారం మార్కాపురంలో చోటుచేసుకుంది. మార్కాపురం సీఐ భీమానాయక్ కథనం మేరకు.. కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు డిగ్రీ పూర్తి చేశాడు. ఇటీవలే ప్రేమించిన యువతితో వివాహమైంది. అయితే కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో క్వాలిఫై కాలేదని తరచూ గుర్తు చేసుకుని బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం తన భార్యతో కలిసి మార్కాపురంలో ఆస్పత్రికి వచ్చాడు. బయటకు వెళ్లి వస్తానని చెప్పిన భర్త ఎంతకీ రాకపోవడం, ఫోన్ స్విచాఫ్ చేయడంతో అనుమానం వచ్చిన భార్య వెంటనే ట్రైనీ ఎస్పీ అంకితా సురానాకు విషయం వివరించింది. దీంతో ఆమె వెంటనే యువకుడి ఫోన్‌ను ట్రాక్ చేయాలని ఒంగోలులోని పోలీస్ ఐటీ కోర్ టీం సిబ్బందిని ఆదేశించింది. ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్న విషయాన్ని తన తమ్ముడికి తెలియజేసేందుకు ఫోన్ స్విచాన్ చేయడంతో దూపాడు సాగర్ కాలువ వద్ద ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ హుటాహుటిన అక్కడకు చేరుకుని యువకుడిని క్షేమంగా ట్రైనీ ఎస్పీ వద్దకు తీసుకురాగా ఆమె కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్యతో సాధించేది ఏమీ లేదని, కుటుంబ సభ్యులతో కలిసి ఉండాలని హితబోధ చేశారు. దీంతో ఆ యువకుడి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మిషన్ ఇంద్రధనస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు

ఒంగోలు అర్బన్: మిషన్ ఇంద్రధనస్సు (టీకాల) కార్యక్రమానికి సంబంధించి అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం స్పందన భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల పిల్లల వరకు ప్రభుత్వం అందిస్తున్న వ్యాధినిరోధక టీకాలను ఉచితంగా వేస్తోందన్నారు. పసిబిడ్డల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. దీనిలో పిల్లలతో పాటు గర్భిణులకు వ్యాక్సినేషన్ వేస్తామన్నారు. దీనిలో పాల్గొనే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రజలకు చేరువ చేయాలన్నారు. 7 నుంచి 12వ తేదీ వరకు టీకాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జేసీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఇమ్యునైజేషన్ అధికారి పద్మజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రం హోం పేరుతో మోసం


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: వర్క్‌ఫ్రం హోం పేరుతో తన వద్ద 2 లక్షల రూపాయలు తీసుకుని మోసం చేశారని టంగుటూరు మండలానికి చెందిన ఎల్.వంశీ సోమవారం ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో మోసం జరిగిన తీరును వివరించారు. వర్క్ ఫ్రం హోం ద్వారా రోజుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉందని టెలిగ్రామ్ యాప్ నుంచి వచ్చిన మెసేజ్‌ను నమ్మి తొలుత రూ.10 వేలు డిపాజిట్ చేయగా రూ.20 వేలు ఇచ్చారని, అలా చివరికి రూ.2 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. అలాగే ఏపీ సెక్రటేరియట్‌లోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఒంగోలుకు చెందిన వి.వెంకటేష్ తన వద్ద నుంచి విడతలవారీగా రూ.6 లక్షలు తీసుకున్నాడని, ఉద్యోగం రాకపోవడంతో తన డబ్బు తిరిగి ఇవ్వమని అడిగితే సమాధానం చెప్పడంలేదని ఒంగోలుకు చెందిన ఎస్.రవికుమార్ ఫిర్యాదు చేశారు. మరికొందరి నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ వాటిని క్షుణ్ణంగా పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఫిర్యాదులపై ఆయా పోలీసు స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం చేయాలని ఆదేశించారు. ఏఎస్పీ(క్రైమ్) శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామి రెడ్డి, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లారీ, గ్రానైట్ టిప్పర్ ఢీ

చీమకుర్తి: సంతనూతలపాడు ట్రిపుల్ ఐటీ కాలేజీ సమీపంలో కర్నూల్ రోడ్డుపై లారీ, టిప్పర్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం రాత్రి 8 గంటల సమయంలో చోటుచేసుకుంది. ఒంగోలు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామతీర్థం నుంచి రామాయపట్నం పోర్టుకు గ్రానైట్ రాళ్లు తీసుకెళ్తున్న టిప్పర్, ఒంగోలు నుంచి సంతనూతలపాడు వైపు వస్తున్న బియ్యం లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు వాహనాల క్యాబిన్లు ధ్వంసం కావడంతో డ్రైవర్లు ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. టిప్పర్ డ్రైవర్‌ను హుటాహుటిన ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. బియ్యం లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను గంటపాటు శ్రమించి బయటకు తీశారు. ప్రమాదం కారణంగా కర్నూలు రోడ్డుపై ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, సంతనూతలపాడు ఎస్సై, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.